సాక్షి నిర్మల్

ఆదివారం ; 24 ; మార్చి ; 2024



మోదుగుపూల రంగుతో ఆడేద్దాం

హోలీ పండుగ వేళ మోదుగుపూలకు ప్రత్యేకత ఉంది. ఈ పూలతో తయారు చేసిన రంగులను వేడుకల్లో వినియోగించడం శ్రేయస్కరమని వైద్యులు సూచిస్తున్నారు. 8లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ ఆది : 6:29 | సహర్ సోమ : 4:54

గరిష్టం/కనిష్టం 37.0 /26.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం ఉదయం, పగలు నిర్మలంగా ఉంటుంది. సాయంత్రం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

నేడు భైంసాకు మంత్రి సీతక్క

భైంసాటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆదివారం భైంసాకు రానున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని గౌరీశంకర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న ముథోల్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరు కానున్నారని, కార్యకర్తలు, నాయకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యేలు భోస్లే నారాయణ్‌రావుపటేల్, జీ విఠల్‌రెడ్డి కోరారు.

కార్యకర్తలు, అభిమానుల అభీష్టం మేరకే కాంగ్రెస్‌లోకి..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: అభిమానులు, కార్యకర్తల అభీష్టం మేరకే తాను బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరినట్లు మాజీ ఎమ్మెల్యే జీ విఠల్‌రెడ్డి తెలిపారు. శనివారం భైంసాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. ఇంకా ఎన్నో అభివృద్ధి పనులు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు, వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉండేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. ఈనెల 24వ తేదీన భైంసాలో నిర్వహించనున్న పార్టీ సమావేశానికి మంత్రి సీతక్క రానున్నారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

వడదెబ్బ బారిన పడొద్దు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

భైంసాటౌన్: ఎండలు ముదిరిన నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిజ్ ఘోరి సూచించారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో కార్మికులు, ఉద్యోగులకు 'వడదెబ్బ–జాగ్రత్తలు' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు వీలైనంత వరకు ఉదయం వేళల్లోనే పనులు ముగించుకోవాలని, ఎండలో ఎక్కువసేపు పనిచేస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. తీవ్రమైన తలనొప్పి, నాడి వేగంగా కొట్టుకోవడం, నాలుక ఎండిపోవడం, శరీరంలో నీటిని కోల్పోవడం వంటివి వడదెబ్బ లక్షణాలుగా గుర్తించాలని తెలిపారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని ముందుగా నీడ ప్రదేశానికి తీసుకెళ్లి, శరీరాన్ని చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలని పేర్కొన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరి నీళ్లు తాగించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ కమలేశ్ తదితరులున్నారు.

'సీఆర్పీఎఫ్' ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఖానాపూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డీఎస్పీ గంగారెడ్డి, సీఐ సైదారావు ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం సీఆర్పీఎఫ్ కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ, సీఐ మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని సూచించారు. ప్రజలు నిర్భయంగా ఓటు వినియోగించుకోవాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ మలింగ్ సన్ అనాల్, ఎస్సై లింబాద్రి తదితరులున్నారు.

నేడు నిర్మల్‌కు కోదండరామ్

నిర్మల్‌చైన్‌గేట్: 'ఉపాధ్యాయ, పెన్షనర్ సమస్యలు–ప్రభుత్వ విధానాలు' అనే అంశంపై పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం నిర్వహించనున్న సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కోదండరాం హాజరవుతున్నారని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆరేపల్లి విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్ సంఘ భవనంలో మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాజిద్ అహ్మద్‌ఖాన్ తదితరులున్నారు.

పొలిటికల్ హోలీ!

- రంగులు మారుతున్న రాజకీయం
- క్రమంగా వెలిసిపోతున్న 'గులాబీ'
- కాంతి విరజిమ్ముతున్న 'కాషాయం'
- సరికొత్తగా మెరిసిపోతున్న 'త్రివర్ణం'
- కలర్ మారుతున్న నేతల కండువా



నిర్మల్: 'హోలీ.. హోలీల రంగ హోలీ చమ్మకేళీర హోలీ..' అంటూ రంగులు చల్లుకుంటూ ఆనందాలను పంచుకునే పండుగ రానే వచ్చింది. చాలాచోట్ల ఆదివారం నుంచే సందడి మొదలైంది. విద్యాసంస్థల్లో శనివారమే ముందస్తు వేడుకలు ప్రారంభమయ్యాయి. రంగులన్నీ కలిపి చల్లుకుంటుంటే జిల్లా కలర్‌ఫుల్‌గా మారుతోంది. ఈసారి పండుగ రంగులతో పాటు 'పొలిటికల్ కలర్స్' కూడా మారుతున్నాయి. రాజకీయం రంగులు మారడం సాధారణమే.. కానీ.. ఈసారి ఊహించని విధంగా మూడు రంగుల (పార్టీల) మధ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. జిల్లాలో హోలీ వేళ.. రాజకీయ కేళీ ఆసక్తికరంగా సాగుతోంది. నేతల మెడలో రంగులు మారుతున్న కండువాలపైనే చర్చ కొనసాగుతోంది.

వెలవెలబోతున్న 'గులాబీ'..

రాష్ట్రంతో పాటు జిల్లాలోనూ దశాబ్దం పాటు గులాబీ (బీఆర్‌ఎస్) పార్టీ ఓ వెలుగు వెలిగింది. గల్లీ నుంచి అసెంబ్లీదాకా ఎటుచూసినా గులాబీ గుబాళించేది. ప్రజాప్రతినిధులు, బడానేతల దగ్గరి నుంచి సామాన్య కార్యకర్తల మెడల నుంచి భుజాల మీదుగా పింక్ కండువా దర్జాగా ఉండేది. పార్టీ కార్యాలయాల్లో కుర్చీల నుంచి చివరకు వారు నడిపించే 'కారు'లోనూ ఆ రంగే తళుక్కుమనేది. అసలు.. ఆ రంగు కనిపిస్తేనే సర్కారు ఆఫీసుల్లో పనులయ్యేవి. చాలామంది ఆ గులాబీరంగుకే గులామ్‌లుగా మారేవారు. అలా.. పదేళ్లపాటు ఓ వెలుగు వెలిగిన గులాబీరంగు వెలిసిపోతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో కుంగిపోతోంది. తాను అందల మెక్కించిన, ఎంతో బలంగా నమ్ముకున్న నేతల మెడల్లో నుంచీ.. దీనంగా జారిపోతోంది.

కాంతులీనుతున్న 'కాషాయం'..

దశాబ్దాలుగా కనిపించి.. కనిపించనట్లు, పేలవంగా ఉండే కాషాయం (బీజేపీ) ఒక్కసారిగా కాంతిపుంజంలా మెరిసింది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న చాలాకళ్లల్లోనూ వర్ణరంజితమైంది. కమలం రెండుచోట్ల వికసించి మురిసేలా చేసింది. అసలు కాషాయరంగు ఇక్కడ కనిపిస్తుందా..! అనే స్థాయి నుంచి ఒక్కసారిగా అసెంబ్లీలో తన గళాన్ని వినిపించేదాకా తీసుకెళ్లింది. కానీ.. హోలీవేళ 'గులాబీ' వెలిసిపోతుంటే.. ఆ రంగును 'త్రివర్ణం' తనలో కలిపేసుకుంటుంటే.. 'కాషాయం' మాత్రం కళ్లప్పగించి చూస్తోందన్న వాదనా ఉంది.

మళ్లీ మెరుస్తున్న 'త్రివర్ణం'..

ఇక ఖతం.. ఆ 'మూడురంగులు' ఇక పాతముచ్చటే. మళ్లీ ఎన్ని హోలీ పండుగలొచ్చినా ఆ 'రంగులు' మాత్రం కనిపించవు.. అనే స్థాయికి త్రివర్ణం (కాంగ్రెస్) పడిపోయింది. జిల్లాలో అసలు త్రివర్ణం మళ్లీ కనిపించదేమో అనే స్థాయికి వెళ్లింది. అలాంటి 'రంగు' అసెంబ్లీలో ఏకంగా ఓ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇప్పుడు జిల్లాలో హోలీ 'త్రివర్ణ' శోభితమవుతోంది. మొన్నటి దాకా 'గులాబీ' కండువా ఉన్న మెడలో ఇప్పుడు 'మూడురంగుల' కండువా పడుతోంది. పాతదోస్తులను కలుపుకొంటూ మళ్లీ పూర్వవైభవం తెచ్చుకుంటోంది.

రాజకీయ రంగులు..

జిల్లాలో రాజకీయం రంగులు మారుతోంది. నేతల మెడలో కండువాల కలర్లు మారిపోతున్నాయి. బీఆర్‌ఎస్‌కు చెందిన గులాబీనేతలు జోరుగా పార్టీని వీడుతున్నారు. తాజాగా నిర్మల్‌కు చెందిన సీనియర్లు, పలు పదవుల్లో ఉన్నవారూ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నద్ధమయ్యారు. 'కారు'లో మిగిలిన నేతల్లో కంగారు కనిపిస్తోంది. ఇక తామూ ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిందేనంటున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ రంగు మారిపోయింది. ఇప్పుడు మూడురంగుల జోరు మళ్లీ కనిపిస్తోంది. మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సీనియర్లు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు క్యూ కడుతున్నారు. మరోవైపు జిల్లాలో రెండుస్థానాల్లో గెలిచిన కాషాయపార్టీ మాత్రం అంతకే మురిసిపోతుందన్న వాదన ఉంది. ఓవైపు కాంగ్రెస్ చేరికల జోరు పెంచితే, బీజేపీ మాత్రం కళ్లప్పగించి చూస్తుండిపోతోందన్న చర్చ ఆ పార్టీలోనే సాగుతోంది.

'అమ్మ'కే ఆ'పరేషాన్'

- ప్రసూతిలో సిజేరియన్లకే మొగ్గు
- కారణాలేమైనా సరే కడుపుకోత
- సర్కారు దవాఖానల్లో 56శాతం
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో 90శాతం..



నిర్మల్‌చైన్‌గేట్: 'అమ్మ'లకు పెద్దాపరేషన్ తప్పడం లేదు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ కడుపుకోతలు సర్వసాధారణమయ్యాయి. ప్రజల్లోని వివిధ రకాల నమ్మకాలూ వీటికి తోడయ్యాయి. ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు చేయాలన్న ఉద్దేశంతోపాటు అత్యధికంగా సాధారణ డెలివరీలు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు కాసులకు కక్కుర్తి పడుతుండగా జిల్లాలో ఇటీవల సిజేరియన్లు పెరిగాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వస్తున్న నిండు గర్భిణులకూ ప్రైవేట్ ఆస్పత్రులు ధనాపేక్షతోనే సేవలందిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. వివిధ రకాల కుంటిసాకులతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో విచ్చలవిడిగా సిజేరియన్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరుగుతున్న వ్యాపార వైద్యంపై కొరడా ఝుళిపించాల్సిన అవసరం ఏర్పడింది.

'నార్మల్'కు అవకాశం ఉన్నా..

జిల్లాలోని పలు ప్రైవేట్ నర్సింగ్‌హోంల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. సహజ ప్రసవానికి అవకాశం ఉన్నప్పటికీ.. ఉమ్మనీరు తక్కువగా ఉందని, బిడ్డ అడ్డం తిరిగిందని, గుండె వేగంగా కొట్టుకుంటోందని, పురిటి నొప్పుల బాధ భరించలేరని.. పేర్కొంటూ కుటుంబ సభ్యులు, గర్భిణి బంధువులను భయపెట్టి అవసరం లేకపోయినా సిజేరియన్లు చేస్తున్నారు. జిల్లాలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం ఫిబ్రవరి వరకు మొత్తం ప్రసవాల్లో ప్రైవేట్‌లో 90, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 56 శాతం సిజేరియన్ కేసులు నమోదయ్యాయి.

అవగాహన కల్పించకపోవడంతోనే..

గ్రామీణ ప్రాంతాల మహిళలు గర్భం దాల్చిన నుంచి వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యారోగ్యశాఖ అధికారులు దృష్టి సారించాలి. ముందుగా గర్భిణుల్లో భయం తొలగించాలి. సాధారణ కాన్పు కోసం వారిని సంసిద్ధులను చేయాలి. నార్మల్ డెలివరీ జరిగితే నాలుగు రోజుల్లో ఇంటికి వెళ్లవచ్చు. అదే శస్త్రచికిత్స అయితే వారం నుంచి 10 రోజుల వరకు ఆస్పత్రిలోనే ఉండాలి. వీటిపై అవగాహన కల్పించకపోవడంతోనే నార్మల్ ప్రసవాలు అంతగా నమోదవడంలేదు.

సర్కారులో సౌకర్యాలున్నా..

జిల్లాలో ఆయా సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలున్నా వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రసవాలు చేయడం లేదనే ఆరోపణలున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 10,708 మంది గర్భిణులకు డెలివరీ కాగా.. ఇందులో 7,578 మందికి సిజేరియన్లు అయ్యాయి. ఇందులో ప్రైవేట్ ఆస్పత్రుల్లో 456 (10శాతం) కాన్పులు నార్మల్ కాగా.. 4,112 (90శాతం) సర్జరీలు జరిగాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలు కాన్పు కోసం సుమారు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.20.56 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

ముహూర్తం చూసుకుని..

పురిటి బాధలు తెలువకూడదని కోరుకునే వారు, శుభ గడియల్లో బిడ్డ పుట్టాలని భావించేవారు కాన్పులకు ముందస్తు ముహూర్తం ఖరారు చేస్తున్నారు. ఇలాంటి కోరికలు పెద్దాపరేషన్లకు దారితీస్తున్నాయి. మరికొందరైతే సాధారణ ప్రసవాల్లో ఏదైనా రిస్క్ జరిగితే ఎలా? అనే మీమాంసలో సిజేరియన్లకు వెళ్తున్నారు. సిజేరియన్ల ద్వారా భవిష్యత్‌లో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన లేకపోవడం మరో కారణం.

ఆస్పత్రులకు ఆదేశాలిచ్చాం

సాధారణ ప్రసవాలు చేయాలని ప్రైవేట్ ఆస్పత్రులకు ఆదేశాలిచ్చాం. ప్రజలు చాలా మంది వివిధ నమ్మకాలతో వారే ఆపరేషన్లు కావాలని కోరుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో సిజేరియన్లు ప్రభుత్వాస్పత్రుల్లో 56 శాతం, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 90 శాతం జరుగుతున్నాయి. సాధారణ ప్రసవాలపై ప్రజల్లో చైతన్యం రావాలి.

– ధనరాజ్, డీఎంహెచ్‌వో

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కండువా కప్పుతున్న మంత్రి సీతక్క

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి, కౌన్సిలర్, ఇతర నాయకులు శనివారం ఉదయం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం వీరు జిల్లా కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మంత్రి సీతక్క చేతుల మీదుగా పార్టీ కండువాలు కప్పుకొన్నారు. వీరిని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పార్టీలోకి ఆహ్వానించారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశించారు. శనివారం పట్టణంలోని చాణక్య ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్షాకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏర్పాట్లు పరిశీలించి విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు.

సకాలంలో సీఎంఆర్ అందించాలి

వానాకాలం సీఎంఆర్‌ను సకాలంలో అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పౌర సరఫరాలశాఖ అధికారులతో సమీక్షించారు. మిల్లర్లు అధికారిక వింగ్స్ యాప్‌లో సీఎంఆర్ నమోదును వేగవంతం చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి నందిత, డీఎం శ్రీకళ, అధికారి సంతోష్ పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెలాఖరులోపు వందశాతం పన్నులు వసూలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్ డివిజన్ రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో పది అంశాల ఎజెండాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. మరమ్మతుకు నోచుకోని బోర్లు, చేతిపంపులను వినియోగంలోకి తేవాలని సూచించారు. ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఉపాధిహామీ పనులు జరిగే ప్రదేశాల్లో కూలీలకు నీడ, నీటి వసతి కల్పించాలని ఆదేశించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని, నర్సరీల్లో మొక్కల సంరక్షణకు గ్రీన్‌షెడ్ నెట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. జాబ్‌కార్డున్న ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా 100 రోజుల పని కల్పించాలని, గ్రామపంచాయతీలకు సంబంధించిన 40 రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కోడ్‌ను కచ్చితంగా అమలు చేయాలని, రాజకీయ పార్టీల ప్రచార పోస్టర్లు, ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సందీప్, తహసీల్దార్లు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే మంచి చట్టాలు

- స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క
- పార్టీ నిర్మల్, ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశాలకు హాజరు



నిర్మల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నిర్మల్‌చైన్‌గేట్/ఖానాపూర్: కాంగ్రెస్ హయాంలోనే దేశంలో ప్రజోపయోగ చట్టాలు వచ్చాయని, బీజేపీ పాలనలో రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక చట్టాలు వస్తున్నాయని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర ఫంక్షన్‌హాల్, ఖానాపూర్‌లోని జేకే ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పార్టీ నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గాల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అటవీహక్కుల చట్టం, ఆహారభద్రత, ఉపాధిహామీ, సమాచార హక్కు, విద్యాహక్కు చట్టాలు వచ్చినట్లు తెలిపారు. ఏడు విడతల్లో భూపంపిణీ చేశామని, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ వేసి వారి అప్పులు మాఫీ చేసిందని ఆరోపించారు. ప్రతీ ఒక్కరి ఖాతాలో రూ.15లక్షలు వేస్తామని మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగాలు కల్పించకుండా పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచి పేదప్రజల నడ్డివిరిచిందన్నారు. పీవీటీజీ (కోలం)లకు ఇళ్లు ఇస్తామని హామీ ఇస్తూనే అటవీ అనుమతుల పేరిట కేంద్రం పరిధిలోని అటవీశాఖ ద్వారా అడ్డుకుంటోందని ఆరోపించారు. కోట్లాదిమందికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించిన సోనియా, రాహుల్‌గాంధీలకు సొంత ఇల్లు కూడా లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం 30వేల మందికి పైగా ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. అందరి అభిప్రాయం మేరకే పార్టీలోకి కొత్తవారిని చేర్చుకుంటామని తెలిపారు. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకే గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మంత్రి సీతక్కను ఆదర్శంగా తీసుకుని తాను పనిచేస్తున్నానని తెలిపారు. భూకబ్జాలు, చెరువు కబ్జాలు చేసిన నాయకులను పార్టీలోకి తీసుకోబోమని చెప్పారు. బూత్‌స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో నామినేటెడ్ పదవులు వచ్చేలా మంత్రి చొరవ తీసుకోవాలని కోరారు. ఆయా సమావేశాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు, మండలాధ్యక్షుడు దయానంద్, నాయకులు సత్తు మల్లేశ్, ఆడె గజేందర్, చిన్నం సత్యం, అలెగ్జాండర్, దుర్గాభవాని, యూసుఫ్‌ఖాన్, చంద్రహాస్, సతీశ్‌రెడ్డి, ఇసాక్, ఆత్రం సుగుణ, ఆత్రం భాస్కర్, నిమ్మల రమేశ్, కావలి సంతోష్, షబ్బీర్‌పాషా, కిశోర్‌నాయక్, తోట సత్యం, మడిగెల గంగాధర్, జహీర్‌అహ్మద్, జంగిలి శంకర్, గుగ్లావత్ రాజేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పరిశీలన

పెంబి: రెండేళ్ల క్రితం వరదలకు కూలిన మండలంలోని హరిచంద్‌తండా వద్ద కడెం వాగుపై ఉన్న వంతెనను మంత్రి సీతక్క శనివారం ఎమ్మెల్యే బొజ్జుతో కలిసి పరిశీలించారు. గత పాలకులు నాణ్యత లేకుండా నిర్మించినందునే వంతెన కూలిందని ఆరోపించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. త్వరగా నాణ్యతతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. మంత్రి వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, పార్టీ మండలాధ్యక్షుడు స్వప్నీల్‌రెడ్డి, నాయకులు శంకర్, అశోక్‌రావు, రమేశ్, రాజన్న, భూమేశ్ తదితరులున్నారు.

ఖానాపూర్‌లో కామదహనం

- ఉత్సాహంగా పాల్గొన్న కాలనీలవాసులు



కామదహనంలో పాల్గొన్న పట్టణ ప్రజలు

ఖానాపూర్: హోలీ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని విద్యాగనర్, శివాజీనగర్, శ్రీరాంనగర్, శాంతినగర్, రాజీవ్‌నగర్ తదితర కాలనీల్లో శనివారం రాత్రి కామదహనాన్ని నిర్వహించారు. అంతకుముందు డప్పుచప్పుళ్ల మధ్య ఇంటింటా తిరుగుతూ పిడకలు, బియ్యం, మోదుగ పూలు సేకరించి ముఖ్యకూడళ్లలో ఉంచారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దహనం చేశారు. మండలంలోని పలు మారుమూల గిరిజన గ్రామాల్లోనూ ఆదివాసీలు సంప్రదాయ పద్ధతిలో కామదహనం నిర్వహించారు. కార్యక్రమాల్లో పండితుడు కీర్తి రాఘుశర్మ, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్రరాజం సురేశ్, వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి వెంకటేశ్వర్లు, ఎస్సై లింబాద్రి, నాయకులు బీసీ రాజన్న, శెట్టి శ్యామ్, కావలి సంతోష్, పరాంకుశం శ్రీనివాస్, కొత్తపెల్లి సురేశ్, మడిగెల గంగాధర్, ఎనగందుల నారాయణ, కిశోర్ నాయక్, బీపీ రమేశ్, పడాల రాజశేఖర్, లాలునాయక్, శ్రీధర్, సురేశ్ తదితరులున్నారు.

క్లుప్తంగా

కలప పట్టివేత



పట్టుకున్న కలప

సిరికొండ: మండల కేంద్రంలో శనివారం అటవీశాఖ అధికారులు కార్పెంటర్ల ఇళ్లల్లో ఆకస్మికంగా దాడులు నిర్వహించగా రూ.లక్ష విలువైన కలప పట్టుబడినట్లు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గీరయ్య తెలిపారు. మండల కేంద్రంలోని పలు ఇళ్లల్లో నిల్వ ఉంచిన కలపను స్వాధీనం చేసుకుని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. బాధ్యులను త్వరలోనే గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమంగా కలప నిల్వ ఉంచినా, రవాణా చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో అటవీ శాఖ ఎఫ్ఆర్వో గణేష్, ఎఫ్‌బీవోలు విఠల్, ప్రవళిక, బేస్ క్యాంపు సిబ్బంది జంగు, లేతు, అరవింద్, అర్జున్, నిరంజన్, మారుతి ఉన్నారు.

ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో పశువుల కాపరి గల్లంతు

నర్సాపూర్ (జి): మండలంలోని టెంబుర్ని గ్రామానికి చెందిన పశువుల కాపరి ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో గల్లంతైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని టెంబుర్ని గ్రామానికి చెందినా పాషా బేగు పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. శనివారం సాయినాథ్ పశువులను మేపడానికి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వైపు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో గేదెలు సుద్దవాగులోకి వెళ్లగా ఆ గేదెలను ఒడ్డుకి తీసుకురావడానికి పాషా బేగు ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో దిగాడు. ఈతరాక అందులో మునిగిపోయాడు. అతడి భార్య వహెద బేగం శనివారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మండ్లు తెలిపాడు.

నిందితుల రిమాండ్

నర్సాపూర్(జి): నర్సాపూర్ (జి) గ్రామ శివారులోని వైద్యుల రాందాస్‌తో పాటు ఐదుగురు రైతుల వ్యవసాయ పంపు సెట్లకు సంబంధించిన ఎలక్ట్రికల్ సర్వీస్ వైరు, ఎలక్ట్రికల్ పోల్ నుంచి ఎలక్ట్రిక్ మోటార్ వరకు గల సర్వీస్ వైర్లను దొంగిలించారని గత సోమవారం ఫిర్యాదు చేయగా ఎస్సై హన్మండ్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భైంసా పట్టణానికి చెందిన షేక్ ఆసిఫ్, షేక్ హైమద్‌ను శనివారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం నిర్మల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు



సంఘటన స్థలంలో క్షతగాత్రులు

కడెం: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శనివారం రెండు బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన వసీం, అఫ్సర్ బైక్‌పై సాయిబాబా ఆలయం వైపు నుంచి బస్టాండ్ వైపు వెళ్తుండగా పెద్దూర్ నుంచి కడెం వైపు వస్తున్న మరో వ్యక్తి బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులకు గాయాలు కావడంతో స్థానికులు వారిని ఆటోలు ఖానాపూర్ ఆస్పత్రికి తరలించారు.

మోదుగుపూల రంగుతో ఆడేద్దాం..



నిర్మల్ సమీప అటవీప్రాంతంలో మోదుగు చెట్టు

- హోలీ వేడుకల్లో మోదుగుపూలు ప్రత్యేకం..
- అడవులకు కొత్త శోభనిస్తున్న వైనం..
- ఉమ్మడి జిల్లా అడవుల్లో విస్తారంగా చెట్లు..
- ఆయుర్వేదంలోనూ అత్యంత ప్రాధాన్యం
- ఆకులు, పూలు, బెరడు అన్నీ ప్రయోజనమేనంటున్న వృక్షశాస్త్ర, ఆయుర్వేద నిపుణులు



ముందస్తు హోలీ సంబరాల్లో పాఠశాల చిన్నారులు



పూలను ఏరుతున్న యువకుడు



పూలతో తయారుచేస్తున్న రంగు

నిర్మల్‌ఖిల్లా: ప్రకృతి అంటేనే అందం, ఆహ్లాదం.. అలాంటి ఆహ్లాదానికి నెలవైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల జిల్లాల్లో విస్తారంగా అడవులు ఉన్నాయి. ప్రస్తుతం మార్చి వేసవికాలం మొదలైంది. హోలీ పండుగ కూడా వచ్చేసింది. పండుగ కోసం రంగుల తయారీలోనూ మోదుగుపూలను వినియోగించే సంప్రదాయం ఉమ్మడి జిల్లాలో కొనసాగుతోంది. హోలీ పండగ సంబరాలను నేటి ఆధునిక కాలంలో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు మార్కెట్లో దొరికే విషపూరిత రసాయనాల ద్వారా తయారుచేసిన రంగులను వాడుతున్నారు. దీంతో చర్మవ్యాధులతోపాటు ఎలర్జీ వంటి సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత కుటుంబాల వారు సమీప ప్రాంతాల్లో దొరికే మోదుగు పూలను తెచ్చి రంగులను తయారు చేస్తూ పండుగ సంబరాలను జరుపుకోవడం గమనార్హం. సహజ సిద్ధంగా రంగులతోనే హోలీ పండుగను నిర్వహించుకోవాలని చెబుతున్నారు..

సహజ సిద్ధంగా రంగు తయారీ ఇలా..

ఫిబ్రవరి, మార్చి నెలల్లో మాత్రమే మోదుగుపూలు పూస్తాయి. నారింజ రంగుతో, ఎర్రని గుత్తులతో కూడి కనువిందుచేస్తాయి. పూర్వ కాలంలో మోదుగు పూల నుంచి తయారు చేసే రంగును హోలీ వేడుకల్లో చల్లుకునే వారు. ఇప్పటికీ జిల్లాలో మోదుగుపూలతో చేసిన రంగులతో హోలీ పండుగను జరుపుకుంటున్నారు. మార్చిలో దొరికే మోదుగు పూలను తెచ్చి ఆరబెట్టాలి. అనంతరం ఒక పాత్ర తీసుకుని దాంట్లో కావాల్సినంత నీరు పోసి మోదుగుపూలను వేయాలి. దీనిని పొయ్యిమీదపెట్టి దాదాపు గంట పాటు మరగనివ్వాలి. దీంతో కాషాయ రంగు ఏర్పడుతుంది. ఈ రంగును చల్లార్చి చిన్న పిల్లలకు బాటిళ్లలో నింపి ఇస్తే హోలీ రంగుగా ఉపయోగపడుతుంది.

మా తాతమ్మ నేర్పింది..



మోదుగుపూలు ఆరోగ్యరీత్యా అనేక సుగుణాలు కలిగి ఉన్నాయని మా తాత మ్మ చెప్పేది. మోదుగుపూలతో తయారుచేసిన రంగులను ఉపయోగించి చిన్నప్పుడు హోలి పండుగ సంబరాలను జరుపుకునే వాళ్ళం. ఒక రోజు ముందే మోదుగు పూలను తెచ్చి నానబెట్టి, ఉడికించిన తర్వాత తయారుచేసిన కాషాయం రంగు లాంటి సహజ సిద్ధ రంగుల ద్వారా పండగలను జరుపుకునే వాళ్లం. మా పిల్లలకు అదే నేర్పిస్తున్నాం.

–నల్ల మన్మోహన్ రెడ్డి, సేంద్రియ రైతు, చించోలి–బి

పలు రకాల ప్రయోజనాలు...



మోదుగు చెట్టు నుంచి లభించే పూలు, బెరడు, ఆకులు, జిగురు వంటివన్నీ కూడా ఆయుర్వేదంలో పలు రకాల ఔషధాలుగా వినియోగిస్తాం. అజీర్తి సమస్యలు, ఉబ్బసం, నోటి పూత, గర్భధారణ, సంతానోత్పత్తి సమస్యలు వంటి వాటికి మోదుగ చెట్టు పరిష్కారం చూపుతుంది. వీటి పూలను మరిగించి చేసిన కషాయం కూడా ఉదర సంబంధ వ్యాధులకు, చర్మవ్యాధులకు మంచి నివార ణిగా ఉపయోగపడుతుంది.

–డాక్టర్ ఉమేశ్‌గుప్తా, ఆయుర్వేద వైద్యుడు, నిర్మల్

ఔషధ మొక్క ఇది..



జిల్లా అడవుల్లో విస్తారంగా వ్యాపించి సమృద్ధిగా దొరికే మోదుగు చెట్టు ప్రకృతికి అందాన్నిస్తుంది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో విరబూసి కొత్తశోభను సంతరింపచేస్తుంది. ఫ్యాబేసీ కుటుంబానికి చెందిన ఈ మోదుగ చెట్టు వేసవికి ముందు ప్రకృతిలో కనువిందు చేస్తుంది. ఈ మొక్క పలు ఔషధ గుణాలను కలిగి మన సంస్కృతిలో సైతం భాగమైంది.

– వెల్మల మధు, వృక్షశాస్త్ర నిపుణులు, అసోసియేట్ ప్రొఫెసర్, నిర్మల్

‘విధులను బాధ్యతా యుతంగా చేపట్టాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్

సాక్షి ఎఫెక్ట్..

నేరడిగొండ: ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు విధులను బాధ్యతాయుతంగా చేపట్టాలని జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. ‘పీహెచ్‌సీ ఎదుట గర్భిణి నిరసన’ అ నే శీర్షికన ‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చేది పేద ప్రజలేనని, అందుబాటులో ఉంటూ వారికి సేవలు అందించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు



పట్టుకున్న మద్యంతో ఎస్సై నరేష్



పట్టుకున్న మద్యం చూపుతున్న ఎస్సై సునీల్

ఇంద్రవెల్లి: అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో అక్రమంగా నిర్వహిస్తున్న టగ్రే ఇందల్ సింగ్, మడావి ఆనంద్‌రావ్ బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి రూ.9140 విలువల గల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ అప్సర్ ఉన్నారు.

బెల్ట్‌షాపులపై దాడి

ఇచ్చోడ: మండల కేంద్రంలో శనివారం పోలీసులు బెల్ట్ షాపుపై దాడిచేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై నరేష్ వివరాలు వెల్లడించారు. లొకెరి రామేశ్వర్ నుంచి రూ.2980 విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపా డు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

తానూరు: మండలంలోని బెల్‌తరోడా గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై శనివారం పోలీసులు దాడి నిర్వహించి మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. బెల్‌తరోడా గ్రామానికి చెందిన యోగేశ్ అక్రమంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడు. శనివారం పోలీసులు బెల్ట్ షాపుపై దాడి నిర్వహించి అందులోని 19వేల విలువ గల మద్యం బాటిళ్లను పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న మద్యం ఎక్సైజ్‌శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు.

పెంబి: పెంబి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగాపూర్ గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. 10.3 లీటర్ల లిక్కర్లు, బీర్లు స్వాధీనం చేసుకున్నామని, సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సీజ్ చేసిన మద్యం విలువ రూ.7వేల వరకు ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇందులో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ వివరాల ప్రకారం... వాఘాపూర్ గ్రామానికి చెందిన ఆత్రం రవీందర్(25) కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మార్గమధ్యలో అదే రోజు రాత్రి 9.30 ప్రాంతంలో తండ్రి లక్ష్మణ్‌కు కలిసి తాను భార్యతో గొడవ పడ్డాడనని, చనిపోతానని చెప్పాడు. మద్యం మత్తులో అంటున్నాడని తండ్రి భావించాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. శనివారం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ వైపు వెళ్లిన వారు గమనించి మృతుడి కుటుంబ సభ్యులకు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృత్యునికి భార్య సునీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

లీడర్ సార్.. ఇదేమి తీరు

- అనుమతుల్లేకుండా విదేశీ పర్యటన
- ఓ వాటర్ కంపెనీ ద్వారా జల్సా
- విమర్శలకు తావిస్తున్న వైనం

ఆదిలాబాద్‌టౌన్: అందరికి ఆదర్శంగా నిలవాల్సిన ఓ ఉపాధ్యాయుడు నిబంధనలకు తిలోదకాలిచ్చాడు. తలమడుగు మండలంలోని ఓ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ.. సంఘ నాయకుడిగా చెలామణి అవుతున్న సదరు ఉపాధ్యాయుడు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు విద్యాబోధన చేసి వారిని తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత కలిగిన ఆ ఉపాధ్యాయుడు అందుకు భిన్నంగా వ్యాపారానికి ప్రాధాన్యతనివ్వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ వాటర్ కంపెనీకి సంబంధించిన విక్రయాలు చేయడంతో సదరు ఉపాధ్యాయుడికి ఆ సంస్థ విదేశీ పర్యటనకు తీసుకెళ్లింది. ఎలాంటి అనుమతులు లేకుండా పర్యటనకు వెళ్లిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విదేశాల్లో జల్సా చేసిన ఫొటోలను వాట్సప్ స్టేటస్‌లో పెట్టుకోవడంతో ఈవిషయం బయటపడింది. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు బ్యాంకాక్, తాయిలాండ్, పటాయా వంటి దేశాల్లో పర్యటించాడు. నిబంధనల ప్రకారం ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు విదేశీ పర్యటన వెళ్లాలంటే విద్యాశాఖ నుంచి తప్పనిసరిగా ఎన్‌వోసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) తీసుకోవాలి. అయితే ఆ ఉపాధ్యాయుడు ఈ నిబంధనలేమి పాటించకుండానే విదేశాలకు వెళ్లాడు. తిరిగి జిల్లాకు వచ్చాక ఈ నెల 12న డీఈవో కార్యాలయంలోని ఇన్‌వార్డులో విదేశాలకు వెళ్లినట్లు లేటర్‌ను అందజేశాడు. ఈ వ్యవహారం బయటపడటంతో తప్పును కప్పిపుచ్చుకునేందుకు లేటర్ అందజేసినట్లు తెలుస్తోంది. కాగా దరఖాస్తుతో పాటు పోలీస్‌శాఖ నుంచి కేసులు లేవని, అనెగ్జర్ బి సర్వీస్‌లో ఎలాంటి ఆరోపణలు లేవని, కోర్టు కేసులు లేవని తదతర వివరాలను నెల రోజుల ముందుగా అందజేయాలి. కానీ ఇలాంటి నిబంధనలేమి ఆ ఉపాధ్యాయుడు పాటించలేదు. అదే విధంగా విద్యాశాఖ అధికారులు ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. నిబంధనల ప్రకారం సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీఈవో కార్యాలయానికి అనుమతి కోసం నివేదించాలి. ఆ అనుమతి పత్రాన్ని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (డీఎస్‌ఈ)కి పంపించాలి. అక్కడి నుంచి విదేశాలకు వెళ్లేలా అనుమతులు ఇస్తే తప్ప వెళ్లేందుకు అవకాశం లేదు. కానీ నామమాత్రంగా ఇన్‌వార్డులో లేటర్‌ను అందజేసి అనుమతులు లేకుండా ఆ ఉపాధ్యాయుడు విదేశీ పర్యటనకు వెళ్లడం గమనార్హం. దసరా సెలవుల్లో కూడా విదేశాలకు ఆ కంపెనీ ద్వారా వెళ్లినట్లు సమాచారం. పలుమార్లు ఆ ఉపాధ్యాయుడు విదేశాలకు వెళ్లడంపై విద్యాశాఖ వర్గాల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో చాలా మంది ఉపాధ్యాయులకు విదేశాలకు వెళ్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు వారిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై డీఈవో ప్రణీతను సంప్రదించగా ఈ విషయంపై సదరు ఉపాధ్యాయుడిని ప్రశ్నించగా విదేశాలకు వెళ్లినట్లుగా ఒప్పుకున్నారని తెలిపారు. దీనిపై విచారణ చేపడుతున్నామని పేర్కొన్నారు. అలాగే సదరు ఉపాధ్యాయుడికి విద్యాశాఖ నుంచి విదేశాలకు వెళ్లేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.

ప్రజాస్వామ్య రక్షణకు పోరాడుదాం

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్

ఎదులాపురం: భగత్‌సింగ్ స్ఫూర్తితో బీజేపీ నుంచి దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు పోరాడుదామని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ ప్రజలకు పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అధ్యక్షతన శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతిని నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యం, దేశంలో ప్రజాస్వామ్య స్థాపన కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన భగత్‌సింగ్ ఆశయాలను బీజేపీ తుంగలో తొక్కుతోందన్నారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలపై ఈడీ, సీబీఐ దాడులు చేయిస్తూ దేశంలో ప్రశ్నించే వారు లేకుండా చేయాలని కుట్రలు పన్నుతోందన్నారు. బీజేపీలో చేరిన అవినీతి పరులందరు కడిగిన ముత్యాలు అవుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల బాండ్ల పేరుతో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన బీజేపీ మీద ఒక్క కేసు ఉండదన్నారు. రాజకీయాల్లోకి మతాన్ని లాగి రాజకీయ లబ్ధిపొందే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కార్మిక చట్టాలు యజమానులకు అనుకూలంగా మార్చి కార్మికులను కట్టుబానిసలను చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. భారత రాజ్యాంగం రక్షణ కోసం, ప్రజాస్వామ్య రక్షణకై భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేశ్, నాయకులు అగ్గిమల్ల స్వామి, సునీత, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు తొడసం భీంరావు, పూసం సచిన్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లంక రాఘవులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి లంక జమున, అధ్యక్షుడు కోవ శకుంతల పాల్గొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటేనా..!

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఫ్రీడమ్ డైమండ్ జూబ్లీ పార్కును ఏర్పాటు చేశారు. పార్కులో అందమైన మొక్కలు, పచ్చగడ్డితో అలంకరించారు. అయితే వేడుకలు ముగిసిన నాటి నుంచి పార్క్ నిర్వహణను పట్టించుకోని నాధుడే కరువయ్యాడు. సాక్షాత్తు జిల్లా ఉన్నతాధికారి కార్యాలయ ప్రాంగణంలో ఉన్నప్పటికీ, పార్కు నిర్వహణకు నోచుకోకపోవడం గమనార్హం. పార్కును పట్టించుకోకపోవడంతో అది కాస్తా ఎండిపోయి కలావిహీనంగా దర్శనమిస్తోంది.



- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

అలేఖ్య కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సీతక్క

ఖానాపూర్: ఇటీవల పట్టణంలో పట్టపగలు ప్రేమోన్మాది చేతిలో నడిరోడ్డుపై హత్యకు గురైన అలేఖ్య కుటుంబాన్ని శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పరామర్శించారు. పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీలోని బాధితురాలి నివాసానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌తో వెళ్లి ఘటనలో తీవ్రంగా గాయపడ్డ జయశీలతో పాటు అలేఖ్య కుటుంబీకులను పరామర్శించారు. చట్టప్రకారం నిందితులపై చర్యలు తీసుకుంటమన్నారు. నిందితులకు శిక్షపడేలా చూస్తామని, ఈ విషయమై ఘటన జరిగిన నాటి నుంచే తాను సంబంధిత అధికారులతో మాట్లాడుతున్నానని, తగు చర్యలకు ఆదేశించానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, నాయకులు దయానంద్, నిమ్మల రమేశ్, షబ్బీర్‌పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ఉత్తమ సేవలకు రాష్ట్రస్థాయి పురస్కారం



అవార్డు అందుకుంటున్న చెన్నమల్లయ్య

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా క్షయ నియంత్రణ విభాగంలో టీబీ, హెచ్‌ఐవీ నివారణ కోసం చేస్తున్న సేవలకు డీపీఎం చెన్న మల్లయ్యకు రాష్ట్రస్థాయి పురస్కారం దక్కింది. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ఈ అవార్డులను ప్రకటించగా జిల్లా నుంచి మల్లయ్య ఎంపికయ్యాడు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్, జాయింట్ డైరెక్టర్ రాధేశ్యాం చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. కాగా గత కొన్నేళ్లుగా టీబీ నివారణ కోసం ఆయన కృషి చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ లీగల్ & డిటెక్టివ్(స్పై): సివిల్, క్రిమినల్, ఫ్యామిలీ, ప్రాపర్టీ, డివోర్స్, హై కోర్ట్, సుప్రీమ్ కోర్ట్ పెండింగ్ కేసులు Fast సెటిల్‌మెంట్ మరియు వెరిఫికేషన్ కొరకు అడ్వకేట్ AS రెడ్డి: 9676094111. [H-804912]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233900]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ. 18k. ఫోన్: 9640468899 / 9640258899 [H-799856]

www.sakshi.com

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-799701]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,

చల్లని ఉపాధి..!





నోరూరించే ఫాలూదా.. ఐస్‌క్రీం సలాడ్

- ఫ్రూట్ జ్యూస్‌లకు భలే గిరాకీ
- ప్రధాన కూడళ్ల వద్ద సెంటర్లు ప్రారంభం

భైంసాటౌన్: వేసవికాలం వచ్చేసింది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మధ్యాహ్నం వేళల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సూర్యతాపం నుంచి ఉపశమనం కోసం జనాలు చల్లచల్లటి ఫ్రూట్ జ్యూస్‌లను ఆశ్రయిస్తున్నారు. ఏటా వేసవిలో ఫ్రూట్ జ్యూస్‌లకు ఆదరణ బాగానే ఉంటుంది. మార్చి మొదలు మే వరకు వీటికి గిరాకీ బాగానే ఉంటుంది. దీంతో సీజనల్ బిజినెస్ చేసేవారు ఇప్పటికే ప్రధాన కూడళ్లలో, రద్దీ ప్రాంతాల్లో ఫ్రూట్‌జ్యూస్ సెంటర్లు ప్రారంభించారు. స్థానికంగా ఉండేవారితోపాటు ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, తదితర ప్రాంతాల నుంచి వచ్చినవారు ఫ్రూట్ జ్యూస్ బిజినెస్ నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ నుంచి పలువురు ఇక్కడికి వచ్చి మూడునెలలపాటు బిజినెస్ నిర్వహిస్తారు. అనంతరం సీజన్ ముగియగానే తిరిగి వారివారి ప్రాంతాలకు వెళ్లిపోతారు. ఇప్పుడిప్పుడే ఎండలు ముదురుతుండడంతో రానున్న రెండు నెలలు గిరాకీ బాగుంటుందని వారు చెబుతున్నారు.

మూడునెలలు గిరాకీ ఉంటుంది

ఏటా ఎండాకాలంలో ఫ్రూట్ జ్యూస్ సెంటర్ నిర్వహిస్తాం. రెండు, మూడు నెలలు గిరాకీ బాగుంటుంది. లస్సీ, ఫ్రూట్ జ్యూస్‌లు, ఇతర కూల్‌డ్రింక్స్ తయారు చేసి అందిస్తాం. ఉపాధి బాగుంటుంది.
– మహేశ్, ఫ్రూట్ జ్యూస్ సెంటర్, భైంసా

అన్ని జ్యూస్‌లు ఉన్నాయి



వేసవిలో ఉపశమనం కోసం ఫ్రూట్ జ్యూస్‌లను ఆశ్రయిస్తుంటారు. మా వద్ద ఫాలూద, డ్రైఫ్రూట్ సలాడ్స్, ఫ్రూట్ సలాడ్స్, బాదాం జ్యూస్, ఐస్‌క్రీం, తదితర అన్ని రకాలు అందుబాటులో ఉంచుతాం. గిరాకీ బాగుంటుంది.
– మహావీర్ ఐస్‌క్రీం సెంటర్ నిర్వాహకుడు, భైంసా

ఎండ నుంచి ఉపశమనం కోసం



ఎండలు మండుతున్నాయి. పని కోసం తప్పనిసరిగా బయటికి రావాల్సిందే. దీంతో ఎండల కారణంగా శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు నీటితోపాటు మజ్జిగ, లస్సీ, ఫ్రూట్ జ్యూస్ వంటివి తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు. – శ్రీనివాస్, భైంసా

ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలి



మాట్లాడుతున్న నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్

సారంగపూర్: పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని నిర్మల్ రూరల్ సీఐ బి.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చించోలి(బి) గ్రామంలో శనివారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వాహనాల తనిఖీలు చేపట్టి 57 బైక్‌లు, 5 ఆటోలను తనిఖీ చేసి పెండింగ్ చలాన్‌లు వసూళ్లు చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా గ్రామస్తులు సహకారం అందించాలని కోరారు. ప్రతిఒక్కరు ప్రశాంత వాతావరణంలో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. స్థానిక ఎస్సై చంద్రమోహన్, రూరల్ ఎస్సై సాయికుమార్, దిలావర్‌పూర్ ఎస్సై సుమాంజలి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరినవారికి కండువా వేస్తున్న సీతక్క

ఖానాపూర్: పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీకి చెందిన నాయకులు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సమక్షంలో వారు పార్టీ చేరగా, కండువాలు కప్పారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో నేరెళ్ల సత్యనారాయణ, మదిరె సత్యనారాయణ, పిసుపాటి వెంకటప్పయ్య, గొర్రె గంగాధర్, గుగ్గిళ్ల రాజేందర్‌గౌడ్, మైలారపు గంగాధర్, చింతపండు రవి, శ్రీహరి, రవీందర్, రాజు, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.



పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాకేంద్రంలో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ విస్తృత సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క హాజరయ్యారు. సమావేశంలో పార్టీ కండువాలు కప్పుకోవడానికి వచ్చిన బీఆర్ఎస్ నేతలకు నిరీక్షణ తప్పలేదు. గ్రంథాలయ చైర్మన్, మాజీ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులను డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు బయటే ఉండమని చెప్పారు. సమావేశ అనంతరం పార్టీ కండువా కప్పుకోవడానికి రాగా సాక్షి క్లిక్ మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



పోలింగ్ కేంద్రాల పరిశీలన



పరిశీలిస్తున్న రత్నాకర్‌రావు

ఖానాపూర్: మండలంలోని గోడలపంపు, కొత్తపేట్, బావాపూర్(కె) గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సెక్టోరల్ అధికారి రత్నాకర్‌రావు శనివారం సందర్శించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతోనే పోలింగ్ కేంద్రాలు పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట కార్యదర్శులు ప్యారెలాల్, రాజశేఖర్, మధు ఉన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి

లోకేశ్వరం: పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో వికలాంగులకు ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఇంటి వద్దనే ఓటు వేసే వృద్ధుల జాబితా తయారు చేయాలని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ మోతీరాం, ఎంపీడీవో సోలమాన్ రాజ్, ఏపీవో మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్కల రకాల బోర్డులు ఏర్పాటు చేస్తున్న ఎంపీడీవో

లోకేశ్వరం: నర్సరీలోని మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో సోలమాన్ రాజ్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలకేంద్రంలోని నర్సరీలో మొక్కల రకాల పేర్ల బోర్డులను శనివారం ఏర్పాటు చేశారు. మొక్కలకు నీరందించాలన్నారు. నర్సరీల చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామ కార్యదర్శి వినయ్‌సాయి ఉన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



భైంసాటౌన్: నివాళులర్పిస్తున్న నాయకులు



తానూరు: కోలూరు గ్రామంలో..



ఖానాపూర్: వర్ధంతిలో పాల్గొన్న నాయకులు

భైంసాటౌన్: దేశ స్వాతంత్య్రం కోసం పిన్న వయసులో ఉరికంబం ముద్దాడిన షహీద్ భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని టీజీవీపీ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో పట్టణంలోని భగత్‌సింగ్ చౌక్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. ప్రభుత్వాలు ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని, భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలని కోరారు. టీజీవీపీ జిల్లా అధ్యక్షులు కె ప్రవీణ్‌కుమార్, జాదవ్ రాము, గణేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చందాపూర్ దిగంబర్, తదితరులున్నారు.

ఖానాపూర్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఉద్యమ స్ఫూర్తితో పోరాటాలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేష్ అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతిని నిర్వహించారు. నాయకులు దుర్గం లింగన్న, మంచికంటి లక్ష్మణ్, గోనె స్వామి, శేఖర్, రాజేశ్వర్, శ్రీనివాస్, సత్తన్న, ప్రసాద్, గంగన్న తదితరులు ఉన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఆమ్‌ఆద్మీ పార్టీ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ మాట్లాడుతూ భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాటాలకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ పట్టణ కన్వీనర్ రవీందర్, మైనార్టీ కన్వీనర్ మహమ్మద్ ఇమ్రాన్, సెక్రెటరీ సోఫీ తదితరులు పాల్గొన్నారు.

దస్తురాబాద్: భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని బుట్టాపూర్‌లో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్,రాజ్‌గురు సుఖ్‌దేవ్ పోరాట పటిమను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నాయకులు శైలేందర్, శంకర్, రాజేశ్వర్, నరేశ్, రవి, ఆనంద్, రంజిత్, రాజేందర్, గంగయ్య, తిరుపతి, శేఖర్, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తానూరు: యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని యూత్ యువకులు సూచించారు. మండలంలోని కోలూరు గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో శనివారం భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ చరిత్రను ప్రభుత్వం పాఠ్యాంశంలో చేర్చాలని డిమాండ్ చేశారు. యువకులు తదితరులు ఉన్నారు.



దస్తురాబాద్: బుట్టాపూర్‌లో..



నిర్మల్‌టౌన్: నివాళులర్పిస్తున్న నాయకులు

పాఠశాలల్లో ముందస్తు హోలీ వేడుకలు



భైంసాటౌన్: గుజిరిగల్లి సరస్వతి శిశుమందిర్‌లో..



దస్తురాబాద్: కస్తూర్బాలో..

భైంసాటౌన్/కుంటాల/లక్ష్మణచాంద/దస్తురాబాద్/ముధోల్/ఖానాపూర్/లోకేశ్వరం/తానూరు/నిర్మల్‌రూరల్/సోన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ముందస్తుగా హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. లక్ష్మణచాంద మండలం పీచర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మోదుగ పూలను సేకరించి తయారు చేసిన రంగులతో హోలీ వేడుకలు జరుపుకున్నారు. ద్రోణా ఉన్నత పాఠశాలలో ఈ వేడుకలు జరిగాయి. ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సంప్రదాయ రంగులతో ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. సోన్ మండలం గంజాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు ఒకరికొకరు రంగులు చల్లుకుని ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు తదితరులు ఉన్నారు.



సోన్ మండలం గంజాల్ పాఠశాలలో..



లక్ష్మణచాంద: పీచర పాఠశాలలో

పోషకాహారం తీసుకోవాలి



భైంసారూరల్: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ భారతి

భైంసారూరల్: పిల్లల ఎదుగుదల కోసం పోషకాహారం తీసుకోవాలని సూపర్‌వైజర్ భారతి అన్నారు. మండలంలోని బడ్‌గాం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్‌పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు, చిన్నారులకు పోషకాహారం అందించేలా చూడాలన్నారు. చిరుధాన్యాలు తీసుకోవడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

కడెం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి అన్నారు. మండలంలోని పెద్దూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై శనివారం అవగాహన కల్పించారు. అనంతరం వారితో పోషకాహార ప్రతిజ్ఞ చేయించారు.

మామడ: నల్దుర్తి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ వనిత, పంచాయతీ కార్యదర్శి రాములు, ఆరోగ్య సిబ్బంది గంగామణి, ఆశ సునీత ఉన్నారు.

సామూహిక సీమంతాలు

ఖానాపూర్: సుర్జాపూర్ పంచాయతీ పరిధిలో గల బుడగజంగంవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ శ్రీలత, టీచర్లు భాగ్య, రమ, వైశాలి, సరస్వతి, శీల, ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

నిర్మల్‌టౌన్: శ్రీ గండిరామన్న ఆలయ ప్రాంగణంలో శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహాలను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

క్లుప్తంగా

ముగ్గురు అంగన్‌వాడీ టీచర్లకు మెమోలు



సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి స్పందన

లక్ష్మణచాంద: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు సమయపాలన పాటించడం లేదు. ఆయా కేంద్రాల పరిస్థితిని వివరిస్తూ 'సమయపాలన పట్టించుకోరా' శీర్షికన శనివారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో వెంటనే డీడబ్ల్యూవో నాగమణి స్పందించారు. ముగ్గురు అంగన్‌వాడీ టీచర్లకు మెమోలు జారీ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతిని ఆదేశించినట్లు తెలిపారు.

నర్సాపూర్(జి) పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న నిర్మల్ రూరల్ సీఐ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాలు, వాటి పురోగతిపై ఎస్సై హన్మాండ్లను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. పోలీసులు రవీందర్‌రెడ్డి, మహేందర్, శ్రీనివాస్, సంతోషి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

కుంటాల: మండలంలోని లింబా(కే) గ్రామానికి చెందిన ఓల్లెపు సంగీత కవల పిల్లలకు జన్మనిచ్చి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.36 వేల చెక్కును నాయకులు శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. నాయకులు సిందె దత్తు పటేల్, శ్రీనివాస్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

సీతక్కను కలిసిన స్వీపర్లు

కడెం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే స్వీపర్లు ఖానాపూర్‌లో మంత్రి సీతక్కను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. 1980 నుంచి చాలీచాలని వేతనంతో జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్నామని, ప్రభుత్వం స్పందించి తమను రెగ్యులైజ్ చేయాలని కోరారు. స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ హుస్సేన్, సత్తెన్న, లక్ష్మణ్, రాజన్న, రాజయ్య తదితరులు ఉన్నారు.

అభ్యాస గురుకులంలో వార్షికోత్సవం

సోన్: మండలంలోని అభ్యాస గురుకులంలో 13వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యం చేశారు. హెచ్‌ఎం ప్రదీప్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకిసేవ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని దేవరకోట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పల్లకిసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. వేంకటేశ్వర లక్ష్మీదేవి ఉత్సవవిగ్రహాలు పల్లకిలో ఉంచి అర్చకులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్, భక్తులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కడెం: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంకం మహేందర్, పార్లమెంట్ ఇన్‌చార్జి సురేశ్ పేర్కొన్నారు. మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో శనివారం నిర్వహించిన బీజేపీ శక్తి కేంద్ర సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి నగేశ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

లోకేశ్వరం: మండలంలోని బాగాపూర్ గ్రామంలో లక్ష్మీ నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం పూజలు నిర్వహించారు. వేద పండితుడు సంతోష్ జ్యోషి, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రేపు 'నీ గానమే నా ప్రాణం'

నిర్మల్‌టౌన్: అయ్యప్ప జన్మదిన స్వామి పురస్కరించుకుని కద్తాల్ శ్రీ ధర్మశాస్త అయ్యప్ప ఆలయంలో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచారసమితి ఆధ్వర్యాన సోమవారం 'నీ గానమే నా ప్రాణం'కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కోటగిరి గోపి, ప్రధాన కార్యదర్శి హరివర్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం పూజలు, భజన కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అయ్యప్ప భక్తులు హాజరుకావాలని కోరారు.

చలివేంద్రాలు ప్రారంభం

భైంసారూరల్: మండలంలోని వాలేగాం పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి సింధూజ, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జెడ్పీటీసీ చిన్నరామయ్య ప్రారంభించారు. తాజా మాజీ సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు కొండ్ర రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నిర్మల్‌పైన్‌గేట్: 11కేవీ మారెమ్మ టెంపుల్ ఫీడర్ పరిధిలో మరమ్మతు దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ రవి ఓ ప్రకటనలో తెలిపారు. శాస్త్రీనగర్, శ్రీనగర్,వినాయకనగర్‌లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

రైతుల వినూత్న నిరసన

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లిలో రైతులు శనివారం వినూత్న నిరసన తెలిపారు. ఎస్సారెస్పీ డీ–16 కాలువకు సంబంధించి పార్‌పెల్లి శివారు నుంచి మునిపెల్లి వరకు ఉన్న ఉప కాలువలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండి సాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించారు. అయినా వారు పట్టించుకోకపోవడంతో రైతులు స్వయంగా జేసీబీతో పూడిక పనులు చేపట్టి నిరసన తెలిపారు. భూమష్, శ్రీనివాస్, సాయికృష్ణ, సాజిదుద్దీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సరుకులు అందజేత

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని మహాలక్ష్మివాడలో నివాసం ఉంటున్న దివ్యాంగురాలు పంచపూలకు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు అందజేశారు. రాంచందర్, శ్రీనివాస్, అశోక్ ఉన్నారు.

జిగురు అట్టలపై అవగాహన

ఖానాపూర్: మండలంలోని పాత తర్లపాడ్ గ్రామంలో కూరగాయల సాగులో ఉపయోగించే జిగురు అట్టల ప్రదర్శనపై డ్రీమ్స్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రైతులకు అవగాహన కల్పించారు. కూరగాయల పంటలో పసుపు రంగు జిగురు అట్టలు పెట్టడం వల్ల రాత్రివేళ వచ్చే తెల్లదోమ, పచ్చదోమ, రసం పీల్చే పురుగులు నిర్మూలించవచ్చన్నారు. చిన్నయ్య, రవి, రాకేశ్, మధులత తదితరులు ఉన్నారు.

చైర్మన్‌కు ఆహ్వానం

నిర్మల్‌టౌన్: నిర్మల్ రూరల్ మండలం అక్కాపూర్‌లో ఈనెల 24 నుంచి 28 వరకు నిర్వహించే రేణుక ఎల్లమ్మ మహాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు హాజరుకావాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్‌కు ఆలయ కమిటీ ఆహ్వానపత్రిక అందించారు. వేణుగోపాల్, కృష్ణ, పద్మనాభం, రవీందర్, రాజాగౌడ్ తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899